

# మీ ఆవిడను కొట్టరా?

డా॥ కలసపూడి శ్రీనివాసరావు

**"మీ** ఆవిడను కొట్టరా?" ఆశ్చర్యార్థకం లాంటి ప్రశ్న వేసిన ఆవిడ అరడజను మంది పిల్లల తల్లి. ముగ్గురు కోడళ్ళకి అత్తగారు. మరో ముగ్గురు, మరో ఇంటి కోడళ్ళకు తల్లి. మూడిరవైలకు బెత్తెడు దూరంలో అరవైదాటిన మొగుడికి 'ఆవిడ'గా గంపెడు సంసారం ఘనంగా సాగిస్తూ, ఎన్నో ఏళ్ళ 'ఆవిడ' అనుభవం అణువణువున నింపుకొని కణకణాన్న కోడలి గుణాన్ని పొదిగి పొదిగి, ముదిరి, ముదిరి, డొక్కలెండి, నక్కలకు భయపడని మేకలా కనపడింది ఆవిడ నా కళ్ళకు.

**చు**ట్టపు చూపుగా ఆ ఊరు వచ్చిన నేను, చుట్టాల సలహాపై గుండె జబ్బు వచ్చిన వాళ్ళ ఆయనను పరామర్శించాలని వచ్చిన నన్ను 'ఎవరు మీరు?' అన్న ప్రశ్నకి నేను చెప్పిన జవాబు విని, ఆవిడ కోడలి తరపు చుట్టం అని గ్రహించిన వెంటనే, మనిషి బిగుసుకు పోయి, బొమ్మైపోయి, వాలుకుర్చీ వేయించి, నన్ను కూర్చోమని,

"ఆయన లేరు, 'ఆయన' ఆవిడను నేనే. నాతో మాట్లాడండి" ఈ విషయం ఇక్కడితో తేల్చి పారేస్తాను, అన్న ధీమాతో జానకమ్మ గారు అనబడే ఓ ఆంధ్రా ఇల్లాలు మా ఇల్లాలి గురించి నన్ను అడిగిన ప్రశ్న అది.

## రవీనా తీరు!

*ప్రేమ గుడ్డిదీ, చెవిటిదీ, మూగది కూడా! 'ఇది ప్రేమికుల కండీ! సంబంధాలని ఎడాపెడామార్చే వాళ్లకి కాదు' అంటారా. రైట్! రెండేళ్ల క్రితం సన్నీడియోల్‌తో, ఆ తరువాత అక్షయ్‌తో జతకట్టిన రవీనా, శిల్పాశెట్టి ధర్మమా అని అక్షయ్‌ని వదులుకోవాల్సి వచ్చింది. డిపుల్ పుణ్యమా అని సన్నీడియోల్‌ని కూడా ఇకనీ మొహం చూపించొద్దని రవీనా అందని సినీ ప్రముఖుల ఉవాచ! తాజాగా రవీనా, రాప్ పాప్ పంజాబీ డాలర్ మెహిందీతో బాటు ప్రదర్శన లిచ్చేందుకని రెండు నెల్లు ప్రపంచ యాత్రకెళ్లింది. ముంబైకి దూరంగా ఉన్నా, సన్ని 'హితు' లతో చక్కని 'టచింగ్' లో ఉందట.*



అది వినగానే, ఈ చుట్టపు చూపు అయిపోయిన తరువాత బీచ్‌కు వెళ్ళి పాత జ్ఞాపకాలలో పరవశించి, దసపల్లాలో డిన్నరు పార్టీకి వెళ్ళి, అక్కడ నుండి సాహితీ మిత్రులతో, కిళ్ళీ బిగించి, కళ్ళు మూతలు పడేదాకా కథల కబుర్లలో కదిలే కాలాన్ని కలకాలం గుర్తుండేలా గడుపుదాం అనుకున్న నా సాయంత్రం ప్లానంతా ఒక్కసారి ఎవరో నా బుర్రలో ఆలోచనలని 'రబ్బరు'తో తుడిపేసిన భావన కలిగింది.

ఆ ప్రశ్న వేసిన ఆవిడ మొహాన్ని చూద్దామని వాలు కుర్చీలో కూర్చున్న నేను తల ఎత్తేసరికి వాలుకుర్చీకి ఓ ఐదడుగుల దూరంలో ఆవిడ ఆ హాల్లో నేల మీద చతికిలపడుతున్నది. ఆవిడ చతికిలపడడం పూర్తి అవగానే, నా మొహాన్ని ఆవిడ కళ్ళు 'పొజిషన్' చేస్తున్న సమయంలో, గదిలో వెలుగుతున్న ట్యూబ్ లైట్ వెలుగులో ఆవిడ మొహం చూశాను.

'ఈ ప్రశ్న అడగడం కోసమే ఇన్నాళ్ళు వేచి ఉన్నాను' అని అనిపించింది ఆమె మొహంలో భావం. తాను వెయ్యబోయే ప్రశ్నకు నేను భయపడి పడిపోతానేమో అని ముందే ఆలోచించి, వాలుకుర్చీలో కూర్చొన్న తరవాతే అడిగిందేమో అని అనిపించింది.

ఊగడం కోసమే వాలుకుర్చీ ఉందని చిన్నప్పటి నుండి నమ్మి వాలుకుర్చీలో కూర్చోగానే ఊగడం అలవాటైన నేను కదిలితే బాంబుల పేలిపోతాయేమోనన్న భయంతో యుద్ధ భూమిలో నిలబడ్డ సైనికుడిలా, ఆ సైనికుడి చేతిలో ఉన్న పేలని తుపాకిలా, నడుం నిటారుగా పెట్టుకుని కూర్చొని ఉన్నాను.

ఒంటిలో కొన్నిచోట్ల చల్లగా, మరికొన్న చోట్ల వేడిగా అనిపించింది. చల్లబడిపోతున్న భాగాలకి రక్తం వెంటనే ప్రసరిస్తే బాగుంటుందనిపించింది. నా గుండె కొట్టుకుంటున్నట్టు నాకే తెలుస్తున్నది. కొద్ది సేపట్లో వినిపిస్తుందేమో అని అనిపించింది. ఉన్నట్టుండి నా స్నేహితులు, కార్డియాలజిస్టు అయిన డాక్టర్ శివప్రసాద్ గుర్తుకు వచ్చారు. 'వెర్రి నాగన్న జడుసుకున్నాడు. దిష్టి తీయండి' అని ధైర్యం చెప్పే అమ్మమ్మ ఏ లోకాలకు వెళ్ళిపోయిందో ఆ లోకాల నుండి దిగి వస్తే బావుణ్ణనిపించింది.

'నీకసలు బుద్ధి లేదు. నీలాంటి నిరుపయోగ ఛాందస్తుల వల్లే ఇలాంటి ప్రశ్నలు 1999లో, ఆపైన 2099లో కూడా ఉంటాయి' అని బాధ, కోపం మేళవించి, సరికొత్త రసాన్ని ప్రసాదించే దీపంలాంటి కళ్ళతో మా ఆవిడ అమాంతం గుర్తుకు వచ్చింది.

'ఇలాంటి వాళ్ళకు ఏ జవాబు చెపుతావో చెప్పు' అన్నట్టు అనిపించింది.

''బాబూ జవాబు చెప్పు'' అన్నారు జానకమ్మ గారు. ''అందరు మొగవాళ్ళు కొడతారు పెళ్ళాన్ని కొద్దో, గొప్పో. అందరు ఎప్పుడో ఒకప్పుడు వర్షంలో తడుస్తారన్నంత సామాన్యంగా. అంత మాత్రాన పుట్టింటికి పారిపోతారా? ఇలా అయితే సంసారాలు చేసినట్టే.''

''అసలు మా ఆయన నన్ను పెళ్ళి అవ్వక ముందు నుండి కొట్టేవారు. కాబోయే మొగుడూ పెళ్ళాలు అని అందరూ నవ్వేవారు. నేను మాత్రం కళ్ళనీళ్ళతో, సిగ్గుతో పారిపోయేదాన్ని అక్కడ నుంచి.

ఆయన కూడా వాళ్ళతో పాటే నవ్వేవారు. మా డాక్టర్ గారి పుణ్యమా అని మా వాళ్ళు ఏడుస్తూ ఇచ్చిన కట్నం డబ్బు పోయినా, ఆ నవ్వు ఆయన పెదాలమీద నుండి చెరిగిపోలేదు'' అని ఆగి, మెడలో మంగళ సూత్రం తీసి కళ్ళకు అద్దుకొని, తల వంచుకుని,

''శోభనం నాడు గదిలో సిగ్గు పడ్డానని, మొట్టికాయ మొట్టారు. తలంతా జివ్వుమంది. నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.''

'తమకాన తేలించు తలపుల
గమకాలు రివ్వు రివ్వుమని
తరుణాన తనువంత తేలియాడు
గజ్జలు ఘల్లుఘల్లుమని
పూల వర్షమై, పూల పాన్పుపై
పవళించు వధువు, నీ మధువు'

పెళ్ళి కానుకగా నా స్నేహితుడు అప్పారావు వ్రాసిచ్చిన కవిత గుర్తుకు వచ్చింది. దాని మాధుర్యం అంతా వెగటనిపించింది. ఆవదం తాగుతున్నప్పటి బెల్లం ముక్కలా.

''పదహారోజుల పండుగనాడు మోటు సరసం మానమని మా పెద్ద నాన్న గారి మూడో అమ్మాయి నా కంటే ఓ ఐదేళ్ళు పెద్దది ఈయనతో అందని, నన్ను గదిలోకి తీసుకెళ్ళి, 'దానితో ఎందుకు చెప్పావని' అన్నారు.

''నేనేం చెప్పలేదని అంటున్నా వినిపించుకోకుండా, లెంపలు వాయించాను'' అని ఆవిడో నవ్వు నవ్వింది. ఆ నవ్వు మురికివాడలో మెర్సిడిస్ కారు హారన్‌లా వినిపించింది.


''మా వాళ్ళంతా బుగ్గలు ఎర్రగా కందాయని ఏడిపించారు. అయితేనేం మా పెళ్ళి చాలా వైభవంగా జరిగింది అన్నారు అంతా. గృహప్రవేశం అయిన తరువాత ఒక రోజు బియ్యం ఏరుతూ ఉంటే, మా అత్తగారు అడిగారు అంతా సవ్యంగా ఉందా అని. 'ఊ!' అని ఊరుకున్నాను. కాని ఆవిడ మరీ రొక్కించి అడిగితే 'మొట్టికాయలు', 'లెంపకాయల' గురించి చెప్పాను.

ఆవిడ నవ్వేసి, మొగుళ్ళంతా అంతేనే అన్నారు.

'కానీ మా నాన్నగారు మా అమ్మని కొట్టరే' అంటే,

'అందుకే మీ అమ్మ ఆడింది ఆట, పాడింది పాట. మీ నాన్న ఒట్టి మెతక మనిషి. మొగాళ్ళంతా అలా ఉండరు. వీడంతా వాళ్ళ నాన్న పోలిక. వట్టి కోపిష్టి. చిన్నప్పటి నుండి అంతే. ఊళ్ళేలవలసిన మొగ మహారాజు వాడు. నలుగురితో సాకుకు రావాలి. నాలుగు వ్యవహారాలు చక్కబెట్టుకుని రావాలి. మగాడన్న తరువాత బయట ఎన్నో వ్యవహారాలు, గొడవలు ఉంటాయి. ఉద్యోగం అంటే మాటలా? అయినా ఆడవాళ్ళకేం తెలుస్తాయి? ఇది తెలుసుకోకుండా మనం ప్రవర్తిస్తే ఎవరికి మాత్రం కోపంరాదు? ఎందుకు కొట్టడు? అన్నారు.

మనవరాలి కోడలని, మా అత్తగారి అత్తగారు కూడా అప్పుడప్పుడు విషయాలు అడిగి తెలుసుకుం




టుండే వారు. మా ముందు జీవితం బాగుండాలని ఎన్నో సలహాలు ఇస్తూ ఉండేవారు. ఆవిడ కూడా మొగుడు పెళ్ళాన్ని కొట్టడం ఓ పెద్ద విషయం కాదని, మా ఆయన తాతగారు, అంటే వాళ్ళాయన కూడా అప్పుడప్పుడు కొట్టేవారని చెప్పారు.

అప్పుడనిపించింది 'పెళ్ళాన్ని కొట్టడం' వీళ్ళ వంశంలో ఉందని.

ఆ తరువాత ఇరుగు పొరుగులతో కలసి మెలసి మాట్లాడుతుంటే తెలిసింది సుమారు అన్ని కుటుంబాలలో ఎంతో కొంత 'పెళ్ళాన్ని కొట్టడం' ఉంటుందని. అంచేత నేనుట్టినే బాధపడాల్సిందేం లేదని, నిక్షేపం లాంటి సంసారం హాయిగా చేసుకుంటూ, గంపెడు పిల్లల్ని కను అన్న పెద్దావిడ దీవెనలను, సలహాలను ఇంకా మరిచిపోలేదు. కాకపోతే మొదట్లో ఒంటిమీద దెబ్బపడిన చోట, మనసులో చాలా బాధగా ఉండేది. ఒంటికంటే మనసులోనే బాధ ఎక్కువ సేపు ఉండేది. రాను రాను అలవాటు అయిపోయింది. ముందు మనసులో బాధ లేకుండా పోయింది. తరువాత ఒంటిబాధ ఓర్చుకోవడం అలవాటయిపోయింది.

ముసిలావిడ పోయే ముందొక జాగ్రత్త చెప్పి పోయింది. ఆ రోజసలేవయిందంటే, ఈయన షర్టు వేసుకుంటున్నారు. నేను పాలవాడికి డబ్బులివ్వాలి అన్నాను. ఎంత అన్నారు. రోజుకు రూపాయి, నెలంతటికి ముప్పై అన్నాను.

'ఈ నెలకెన్ని రోజులే?' అన్నారు. ముప్పై అన్నాను. చేతిలో ఉన్న హేంగరుతో ఎడాపెడా కొట్టారు వెంటనే. అప్పటికప్పుడు ఏడాదిలో నెలలు, ప్రతీ నెలకు ఎన్ని రోజులో వల్లె వేయించారు. అప్పుడు తెలిసింది, ఆ నెల ఆగస్టు, అంచేత ముప్పై ఒక్క రోజులు ఉంటాయని.

ఓ మూల మంచంలో పడుకొని చూస్తున్న ముసలావిడ, ఆయన వెళ్ళిపోయాక దగ్గరకు పిలిచి వాడొట్టి మూర్ఖుడు. చేతికి ఏదందితే దానితో కొడతాడు. వాడితో ఇలాంటి విషయాలు మాట్లాడేటప్పుడు చేతిలో చుట్టుపక్కల ఏవీ వస్తువులు లేకుండా చూసుకో అని జాగ్రత్త చెప్పారు.

మరో సారి ఇలాగే చిన్నవాడి చేత లెక్కలు చేయిస్తున్నాను. ఏదో తప్పు చెప్పానని, ఎదురుగా టేబుల్ మీదనున్న కంపరబాక్స్ నా మొహం మీదికి విసిరారు. అక్కడితో ఆగక ఎక్కాలు వల్లె వేయించారు కూడా. ఈయనకు లెక్కలంటే మహా ఇష్టం. ఒక్క తప్పు రాకూడదు. వాళ్ళ ఆఫీసరు ఈయనకు లెక్కల్లో ఉన్న తెలివికి మురిసిపోతుంటారుట.

''అదే పోలిక మా అబ్బాయిలకు కూడా వచ్చింది. వంశంలో పోలికలు ఎక్కడకు పోతాయి అని ఆగి, ఏమే కోమలా ఇలారా ఒకసారి'' అని వంటింటి వైపు తిరిగి కేకవేశారు.

కోమలంగా ఉన్న ఓ పాతికేళ్ళ అమ్మాయి వచ్చి, హాలు గుమ్మం దగ్గరే నిలబడిపోయింది.

''రకరకాల చిట్కాలు ఉపయోగించి, మొగవాళ్ళని శాంతపరచడమో, దెబ్బపడకుండా చూసుకోవడమో చెయ్యాలిగాని'' అని తల వెనక్కు తిప్పి,

''ఇలా ముందుకు రావే'' అని, 'దీనిది బారెడు జుత్తు. అది చూసే మురిసిపోయి దీన్ని చేసుకుంటాను అన్నాడు మా పెద్దాడు. మా ఆయన కట్నం కొద్దిగా తక్కువని అన్నా సరే, వాడి సరదా కూడా చూడాలని ఆయన్ని ఒప్పించాను. అయితే, వాడికి కోపం వచ్చినప్పుడల్లా దీని జడ పట్టుకుని లాగుతాడు. ఇది కొంపలంటుకుపోయినట్టు కేకలు, ఏడుపులు. అంచేత దీన్ని ముడేసుకు తిరగమన్నాను. అప్పటి నుండి వాడి ఆగడం తగ్గింది. ఏవో చెప్పవే' అని కోడలి వైపు చూసి అన్నారు.

నా తల వంగినంత వంగి, ఇంకెప్పటికీ ఎత్తలేనంత క్రిందికి వంగిపోయినట్టు అనిపించింది. కదలక కాళ్ళేకాదు తలకూడా తిమ్మిరెక్కినట్టయింది. గుండె కొట్టుకోవడమే కాదు, నేను ఊపిరి పీల్చడం కూడా నాకు తెలుస్తున్నది. ఆ వాలు కుర్చీ ఒక నేల నూతిలా అనిపిస్తున్నది.

నాకున్న పరిసర జ్ఞానం అంతా జానకమ్మ గారి గొంతుకు, ఆ హాలుకు, ఆ హాలులో వెలుగుతున్న ట్యూబ్‌లైట్‌కు మాత్రమే పరిమితమైపోయింది. సమయం ఆగిపోయినట్లు, నేను రాయి అయిపోయినట్లు అనిపించింది. ఈ తటస్థ అనిశ్చిత స్థితికి అంతం ఎప్పుడో తెలియడం లేదు. ఉలుకు పలుకు లేకుండా ఆవిడ మాటలు వినడానికి మాత్రమే నా జ్ఞానేంద్రియాలు ఉన్నట్లు, వాటికి జీవం ఇవ్వడానికే నేను ఉన్నట్లు ఉంది అప్పటి నా స్థితి.

అలా ఆవిడ ఆ ఇంట ఏ ఏ ఆడపడచు, ఏ విధాన వారి వారి భర్తల వల్ల ఏ విధమైన తిట్లు, తన్నులు తిన్నారో, వారింట అది ఎంత సహజమో, వివరంగా, కోర్టులో లాయర్లు సాక్షులని ప్రవేశపెట్టి చెప్పిన తీరులో, ఓ రెండు గంటలపాటు, 'ఆడదానిపై మగవాడి అమానుషత్వం' అన్న విషయాన్ని సోదాహరణంగా, సోషియాలజీ ప్రొఫెసర్‌లా లెక్చరిచ్చారు. ఆ వివరాలు, మగవాడిగా నేను చెప్పలేను, వ్రాయలేను.

దోమలు జోరుగా తిరుగుతున్నాయి. కళ్ళకు కనబడుతున్నాయి. ఆడవాళ్ళ నిస్సహాయ స్థితికి ఆపకుండా ఏడుస్తున్నాయా అన్నట్లు చప్పుడు చేస్తున్నాయి. ఆడవాళ్ళ ఆ బాధలన్నింటికి మూలకారణమైన మగ మనిషిని నేనే అన్నట్లు నన్ను కసిగా కుడుతున్నాయి. ఎదురుగా ఉన్న ఆడవాళ్ళని కుడుతున్నట్లు నాకనిపించలేదు.

దోమలకి ఆడ, మగ మనుషులని పోల్చే శక్తి ఉంటుందా అన్న శాస్త్రీయపరమైన ప్రశ్న అత్యంత అసందర్భమైన సమయంలో నా మెదడుకు తట్టింది. ఆ ఇంటికి వచ్చిన తరువాత నా మెదడు చేసిన మొట్టమొదటి పని అది. న్యూరో బయాలజీలో పరిశోధనలు చేస్తున్న ఓ నలుగురి మిత్రులకు, డాక్టర్ ఫ్రాన్సిస్ క్రిక్‌కు ఈ ప్రశ్న వెంటనే ఈమైల్ ద్వారా పంపాలనిపించింది. అదే కాని నిజమైతే, దోమలలో మను

షులని పోల్చుకునే శక్తి కేంద్రాలని పని చేయనివ్వని మందులని తయారు చేయవచ్చునని, దానివలన మనుషులకి హానిలేని విధంగా, దోమలని చంపకుండానే, దోమలద్వారా వ్యాపింపబడే మలేరియా, ఫైలేరియా వంటి జబ్బులని అరికట్టవచ్చునని, అలా అపరిసరాలు మరిచిపోయి మెదడు పనిచేసే తీరు మీద, అపరిజ్ఞానపు ప్రయోజనాల మీద, నా మెదడు పని చేయడం మొదలుపెట్టింది.

''కాఫీ పుచ్చుకోండి'' అన్న జానకమ్మ గారి మాటతో ఆ పరిసరాలకు వచ్చాను.

తల ఎత్తలేదు. నా కళ్ళకు ఎర్రంచు పచ్చ చీర కుచ్చెళ్ళు, ఆ కుచ్చెళ్ళ అంచునున్న పాదాలు, ఆ పాదాలకున్న మట్టెలు కనిపించాయి. ప్రస్తుతం నాకు ఏ ఆడపిల్లని, ఆడ మనిషిని చూడాలని లేదు.

ఇదంతా నేను చదువుతున్న కథలోనో, నవలలోని సన్నివేశం అయితే, ఆ నవలని అక్కడికక్కడే టక్కున మూసెయ్యాలని, కల అయితే కళ్ళు తెరిచెయ్యాలని, ఒక్కసారి ఊపిరి పీల్చుకోవాలని, మొహాన్ని చల్లని నీళ్ళతో కడుక్కోవాలని ఉంది. కానీ ఇది కథ, నవల, కలకాదు. అంతా కళ్ళ ముందే జరుగుతున్నది. కాళ్ళు కదపలేని పరిస్థితి. కదలాలని ఉంది. కదలలేను. పారిపోవాలని ఉంది. పారిపోలేను.

విచ్చుకున్న భూమిలోకి వెళ్ళిపోయిన సీతలా, ఎందులోకైనా చొచ్చుకు పోవాలని ఉంది. కాని నిస్సహాయంగా ఆ వాలుకుర్చీకి అతుక్కుపోయాను. కొన్నేళ్ళ క్రిందట కాల్టెక్స్ క్వార్టర్సులో కేరళ అమ్మాయి కాఫీ అందిస్తున్నప్పుడు ఆమె కళ్ళల్లోకి కళ్ళు పెట్టి చూసినప్పుడు కూడా ఇలాగే ఆ కుర్చీకి అతుక్కుపోయిన జ్ఞాపకం వచ్చింది, కానీ ఆ ఊహ అతిచేదుగా, వగరుగా, పచ్చి కరక్కాయి కొరికినట్టు అనిపించింది. ఆనాటి నుండి ఈనాటి వరకు దాచుకున్న సౌకుమార్యమైన భావం ఒకటి కొలిమిలోపడి కాలిపోయిన పువ్వులా అనిపించింది.

కళ్ళు మాత్రమే ఎత్తి, కనిపించినంత వరకు చూశాను. ఎదురుగా, కొద్దిగా వంగి, సెగలు కక్కుతున్న కాఫీ గ్లాసు పట్టుకుని ఒకామె ఉంది. క్షణాలు గడుస్తున్నాయి. చెమటలు కారుతున్నాయి.

'అదక్కడ పెట్టి విసినకర్ర తెచ్చి విసరవే, ఆయనకి ''అన్న జానికమ్మ గారి కేకకి ప్రతి చర్యగా, ఆమె మరింత వంగుని నేనందుకోని కాఫీ కప్పుని నాకందే అంత దగ్గరలో వాలుకుర్చీకి ప్రక్కగా పెట్టింది. అప్పుడు అయిన గాజుల చప్పుడు మరే పరిస్థితిలో అయినా అయి ఉంటే ఏవి భావాలను కలిగించేదో, ఏవి భాగాలను కదిలించేదో కాని, ఇప్పుడు ఖాళీ గాజు సీసా పగిలినప్పుడు వినిపించే ఆఖరి శబ్దాన్ని మాత్రమే తలపించింది.

జానకమ్మ గారు అలా మాట్లాడుతున్నారు.

విసనకర్రతో విసిరిన గాలి చల్లగా తగిలింది. కాని హాయిని కలిగించలేదు. దెబ్బమీద టించర్ అయొడిన్ వేసి ఊదినట్టనిపించింది.

'చాలు' అన్న ఒక్క మాట రెండు సార్లు నా నోటి నుండి ''చాలు చాలు''గా వచ్చింది. మౌనం రాతి విగ్రహమై లేచి నిలబడ్డట్టుగా లేచి నిలబడ్డాను. రాతి విగ్రహాలలో కూడా రమ్యమైన భావాలను చెక్కగల శిల్పులుంటారు. కాని మౌనమే మనిషైన నా మొహంలో ఏ భావము లేదని, ఎదురుగా ఉన్న అద్దంలో కనిపించిన నా ప్రతిబింబం నిరూపించింది.

అప్పుడు నాకు తలలేకపోతే బావుణ్ణనిపించింది. అప్పుడు తలలేనితనం కావాల్సి వచ్చింది. లక్షలాది సంవత్సరాల ప్రకృతి పరిణామ శక్తి వల్ల మెరుగులు దిద్దబడ్డ లక్షణమైన నా తల నాకు నచ్చలేదు. చాలా బాధ కలిగించింది. అసహ్యం కలిగించింది. ఆ తల నేను చెయ్యని తప్పులకు ఎల్లకాలం నా తోటి ఉండే నా తప్పుడు సాక్షిలా అనిపించింది.

ఎక్కడికి వెళ్ళాలో తెలియదు. కానీ మరమనిషిలా కదిలాను.

అంతలో అమాంతంగా జానకమ్మ గారు నా కాళ్ళను ఆమె రెండు చేతులతో చుట్టి పట్టుకునే ప్రయత్నంలో ముందుకి వంగి, తల ఎత్తి ''బాబ్బాబు పెళ్ళాన్ని కొట్టాడని మా వాడి మీద కేసు పెట్టకండి. పెద్ద దాన్ని కాళ్ళు పట్టుకుని బ్రతిమిలాడుతాను. ఇలాంటి పిల్లల్ని కన్నందుకు నన్నే జైల్లో పెట్టించండి'' అంటున్న ఆవిడ చేతులకు అందకుండా వెనక్కి జరిగి ఆ హాలులోంచి, వాకిటిలోకి, వాకిటిలోంచి వీధిలోకి, వీధిలోంచి బీచ్ రోడ్డు మీదకి, అక్కడి నుండి బీచ్‌లోకి నిద్రలో నడిచి వెళ్ళే మనిషిలా నడచి వెళ్ళికూర్చొన్నాను.

కొన్ని గంటల సేపు నన్ను నిశ్చేష్టుణ్ణి చేసిన జానకమ్మ గారి ప్రశ్న, మెల్లిగా నాలో ఆలోచనలు రేకెత్తించింది. కొట్టే వాళ్ళని తిరిగి కొట్టడం, కొట్టించడం, కొట్టడానికి తగిన శిక్షణ అందించడం, పెళ్ళాన్ని కొట్టడం అనే సాంఘిక సమస్యకు సమాధానాలు కావు. ఆవేశం ఇంధనమైన ఆలోచనల ఫలితమే అవు తుంది. కేసు పెట్టవచ్చు. కానీ దానికి కొట్టబడిన ఆడది ధైర్యంగా నిలబడి, అత్తమామలతో, బహుశా తల్లి దండ్రులతో, బంధువులతో తన చుట్టూ ఉన్న సమాజంతో పోరాడుతూ నెగ్గుకు వచ్చి, ఆర్థికంగా తన కాళ్ళ మీద తాను నిలబడినప్పుడే కోర్టు కేసు. చాలా మంది తమకెంత కష్టం ఉన్నా భరిస్తారు కానీ, తమ సంసారాన్ని కోర్టుకు తీసుకు రారు. కోర్టు ఇచ్చే తీర్పు 'మనిషి'ని మార్చలేదు. 'మనిషి' ఆలోచనలో మార్పు మాత్రమే ఇటువంటి సాంఘిక సమస్యలకు తగిన పరిష్కారం. ఈ దిశలో నా ఆలోచనలు ముందుకి వెనక్కి సాగాయి. ఏ మార్పువల్ల అయితే ఇటువంటి సమస్యలు సమసిపోతాయో, అటువంటి మార్పు అవసరం నా ఆలోచనలకు కూడా ఉందని తోచింది.

ఆ క్షణం నుంచి అడివిలోని ఎండి, రాలి నేలపై పడివున్న ఆకులని చిన్న నిప్పురవ్వ పొగలేకుండా కాల్చిన తీరులో నా ఆలోచనల అడవిని శుభ్రం చేసింది. ఏ వాదాలు, ఉద్యమాలు చెయ్యని పని ఒక్క రోజులో చేసింది. అయితే ఆ మార్పు నా ఒక్కడికే పరిమితం. బహుశా ఈ మార్పు తీర్పు ఇంతేనేమో. అంచేత నేను మీకు కూడా అదే ప్రశ్న వేస్తున్నాను. 'మీ ఆవిడను కొట్టరా?'


రూ. 2,50,000/-ల విలువగల బహుమతులు గెలుపొందండి

| | | |
|---|---|---|
| 10 | | |
| | 11 | |
| | | 12 |

ప్రత్యేక బహుమతి:
హీరోహోండా
మోటార్‌సైకిల్
(లేదా) చేతక్ స్కూటర్
(లేదా) కలర్ టి.వి.

| | | |
|---|---|---|
| 8 | 13 | 6 |
| 7 | 9 | 11 |
| 12 | 5 | 10 |

కన్సొలేషన్ బహుమతులు:
మ్యూచువల్ బెనిఫిట్ పథకం ప్రకారం కెమెరా, టూ-ఇన్-వన్, ట్రాన్సిస్టర్, శారీస్, రిస్ట్‌వాచ్

పై నమూనాలో వలె ఇన్‌లాండ్/ఎన్వెలప్‌పై ని ఖాళీ గడులను గీయండి. 7 నుండి 15 వరకు గల అంకెలను ఉపయోగిస్తూ నిలువుగా, అడ్డముగా, ఏటవాలుగా ఎటు కూడినా మొత్తం 33 వచ్చేలా చూడండి.

ఒక అంకెను ఒక్కసారి మాత్రమే ఉపయోగించాలి. మీ ఎంట్రీలను 10 రోజులలోగా ఆర్డినరీ మెయిల్ ద్వారా పంపండి. ముందుగా చేరిన 10 ఎంట్రీలకు టైటాన్ వాచ్ గోల్డెన్ చైన్ బహూకరించబడును.

SIGMA SALES INDIA (W-4)
DALLUPURA
DELHI - 110 096